# వడ్లగింజలో బియ్యంగింజ



గిరీశం మాస్టారి రూపానికి తగినట్లుగానే వ్యక్తిత్వం కూడా ఉంటుంది.

ఏమీలేని దాన్లోంచి కూడా ఎంతో విషయాన్ని లాగడంలో ఆయనకి ఆయనే సాటి. ఆ చెప్పేది పాఠమైనా, వేరే విషయమైనా, ఆఖరికి పిచ్చాపాటీ కబుర్లైనా వినేవాళ్ళకి ఎంతో ఉత్కంఠత కలుగుతుంది.

ఆరోజు ఆదివారం! నలుగురు కాలేజి స్టూడెంట్స్ పార్కులో ప్రక్కన లాన్స్ మీద కూర్చుని ఉషారుగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

గిరీశం మాస్టారు కూడా అటు వచ్చారు.

ఆయన రాగానే ఒక కొత్త వెలుగు వచ్చినట్లయింది. నలుగురూ ఆయన్ని సాదరంగా ఆహ్వానించారు. ఆయన కూడా అభిమాన పూర్వకంగా వారి ప్రక్కన కూర్చున్నాడు.

"మాస్టారూ... పెళ్ళికి వెళ్లారని విన్నాను. ఎప్పుడు వచ్చారు?" అన్నాడు శేఖర్.

"ప్రొద్దునే వచ్చానోయ్!" అన్నారు మాస్టారు- జేబులోంచి సిగరెట్ పెట్టె తీస్తూ.

"పెళ్ళి విశేషాలు ఏమిటి మాస్టారూ?" అడిగాడు ప్రకాశ్.

"పెళ్ళి విశేషాలకేం కాని, అంతకుమించిన విశేషం చెప్తాను" అన్నారాయన.

ఆయన చెప్పేదేమిటోనని ఉత్సుకతతో ఉగ్గబట్టుకొని కూర్చున్నారు వాళ్ళు.

పెట్టెలోంచి సిగరెట్‌ని తీశారు ఆయన.

"మీలో ఎవరైనా కొరివి దయ్యాన్ని చూశారా?" అన్నారు నిర్లిప్తంగా.

లేదంటే... లేదన్నారు అందరూ.

మాస్టారు మౌనంగా సిగరెట్ నోట్లో పెట్టుకున్నారు. అగ్గిపెట్టె కోసం వెతుక్కోడం మొదలుపెట్టారు.

దయ్యం కబుర్లనేసరికి వారంతా ఊపిరి బిగబట్టి వినడానికి కూర్చున్నారు.

ఆయన చేస్తున్న ఆలస్యం వాళ్ళకి భరించరానిదిగా ఉంది. ఇద్దామంటే ఎవరి దగ్గరా అగ్గిపెట్టె లేదు.

ఎలాగైతేనేం... మాస్టారి లోతైన పైజామా జేబులో అగ్గిపెట్టె దొరికింది.

సిగరెట్ నోట్లో పెట్టుకొని వెలిగించారు. గట్టిగా ఒక దమ్ము లాగి పొగని బయటికి వదిలారు.

"ఆ... నేను పెళ్ళికి వెళ్లానా- తిరిగి వచ్చేటప్పుడు ఏమైందనుకున్నారు?" ఆయన మళ్లీ సిగరెట్ నోట్లో పెట్టుకొని పొగ పీల్చాడు.

నలుగురి గుండెలూ దడదడలాడుతున్నాయి.

"మేము వస్తున్న బస్ ఇక్కడికి పదిమైళ్ల దూరంలో చెడిపోయింది. అదే చివరి బస్. అందువల్ల మర్నాటి ప్రొద్దున మరో బస్ వచ్చేదాకా మేము అక్కడ భజన చేయవలసిందే!" చెప్పడం ఆపి మళ్లీ దమ్ము లాగారు.

"అప్పుడేమైంది?" ఉండబట్టలేక అడిగాడు చంద్రం.

"అదే చెప్తున్నాను. పదిమైళ్లే కదా! నాకెలాగూ సామాను లేదు. నడిచి వచ్చేస్తే పోలా... అనిపించింది."

"ఏమిటీ... అంత రాత్రప్పుడా?" అన్నాడు శేఖర్.

"బాబోయ్... దారిలో అడవి లేదూ?" అన్నాడు భయంగా నరహరి.

"ఉంటే నాకేం భయం? వచ్చేద్దామనుకున్నాను... వచ్చేశాను."

"ఆ అడవిలో కొరివి దయ్యాన్ని చూశారా?" అడిగాడు చంద్రం.

"అసలు అంత చీకట్లో ఎలా రాగలిగారు మాస్టారూ?" ప్రకాష్ ప్రశ్న.

"చెప్తాను. నిన్న అమావాస్య కదా! చిమ్మ చీకటి... కళ్ళు పొడుచుకున్నా ఎదురుగా ఏముందో కనిపించడం లేదు. అలాగే అడవిలోగుండా బయలుదేరాను" మాస్టారు ఆరిపోయిన సిగరెట్ ముట్టించుకోవడం కోసం చెప్పడం ఆపారు.

ఆయన చెప్పబోయేది ఊహించుకుంటూ నలుగురి గుండెలూ దడదడ లాడ్తున్నాయి.

"అంత చీకట్లో ఎలా బయలుదేరారు మాస్టారూ! దారెలా కనిపించింది?" ప్రకాష్ ప్రశ్నించాడు.

గిరీశం మాస్టారు సిగరెట్ మళ్లీ వెలిగించి గట్టిగా పొగ తీసుకున్నారు.

"కాళ్లకు షూస్ ఉన్నాయి. అందువల్ల నడవడానికి భయం లేదు. దారి తెలిసినదే. అస్పష్టంగా కనిపిస్తుంది. అయినా నా దగ్గరో చిన్న టార్చిలైటుంది. మధ్య మధ్య దాన్ని వేస్తూ, ఆర్పుతూ బయలుదేరాను."

ఆయన చెప్పడం ఆపి పొగని వదుల్తూ నలుగురి ముఖాలవంకా ఒక్కసారి చూశాడు.

ఆయన ఏం చెప్పబోతున్నాడోనని దడదడలాడాయి వాళ్ళ గుండెలు.

"అలా అలా దూరం వెళ్లాను. అడవి మధ్యకి వచ్చి ఉంటాను. ఇంతలో... ఎదురుగుండా ఏదో అస్పష్టంగా శబ్దం వినిపించసాగింది. అదేదో నావైపే వస్తున్నట్లనిపించింది. ఒక్క క్షణం అక్కడే నిల్చుండిపోయాను" మాస్టారు త్రాగుతున్న సిగరెట్ ఆరిపోయింది. దాన్ని అవతల పారేసి ఇంకోటి ముట్టించారు.

నలుగురి చెవుల్లోంచి ఆవేశం వేడిగా రాసాగింది.

"చిమ్మ చీకటి! గాలి కూడా గట్టిగా వీయడం లేదు. ఆకులు కదలడం లేదు. ఆ సమయంలో ఆ కటిక చీకటిలో..."

గిరీశం మాస్టారు చెప్పడం ఆపి మళ్లీ గట్టిగా దమ్ములాగారు.

"అప్పుడేమైంది?" ఉండబట్టలేక అడిగాడు శేఖర్.

"అదే చెప్తున్నాను. ఆ చిమ్మ చీకటిలో ఎర్రనిమంట గాలిలో తేలుతోంది. అది ఏమై ఉంటుందా... అని ఆలోచిస్తూ అక్కడే కొంతసేపు నిలబడ్డాను. ఆ మంట అటూ ఇటూ ఊగింది. ముందుకీ, వెనక్కీ ఆడింది. చూస్తుండగానే ఆ మంట కాస్తా ఎర్రగా కణకణలాడే

నిప్పుగా మారింది. ఆ అర్ధరాత్రిపూట ఎవరైనా చలి కాచుకొంటున్నారేమోనని అనుకున్నాను. కాని, చలిమంట అయితే అంత చిన్నగా ఉండదు. పైగా... నేలమీద లేకుండా గాలిలో ఎలా తేలుతుంది?''

మాస్టారు చెప్పడం ఆపి మళ్లీ దమ్ములాగారు.

''నేనలా ఆలోచిస్తుండగానే ఆ మంటాకారం నావంక నెమ్మదిగా రాసాగింది. పైగా... నావంక కోపంగా చూస్తున్నట్లు ఉండుండి ఆ ఆకారం పెద్దది అవుతోంది. నేను ఎరక్కపోయి వచ్చానేమోనని అనుకోసాగాను. చిన్నప్పుడు మా పెద్దవాళ్ళు చెప్తుండిన 'కొరివిదయ్యం' అంటే అదేనేమో అనిపించింది. ఆ ఆలోచన రాగానే నాకు తెలియకుండానే ఒక విధమైన భయం ఆవరించింది.''

కొత్త సిగరెట్ ముట్టించడం కోసం మాస్టారు మళ్లీ ఆగారు.

నలుగురు కుర్రాళ్ళూ ఉత్కంఠ ఆపుకోలేకపోతున్నారు.

మాస్టారు మళ్లీ చెప్పడం మొదలుపెట్టారు-

''చిన్నప్పుడు నేర్చుకున్న ఆంజనేయ దండకం జ్ఞాపకం వచ్చింది. చదువుదామా... అనుకున్నాను. కాని, నావంటివాడు భయపడ్డమేమిటని చదవలేదు. వెనక్కి తిరిగి పారిపోదామా... అనిపించింది. కాని, మనసొప్పలేదు. ఏమి చేయడానికీ తోచక అక్కడే ఉండిపోయాను.''

చెప్పడం ఆపి మళ్లీ పొగ పీల్చారు మాస్టారు.

''నేనలా ఉండగానే, ఆ ఆకారం నెమ్మదిగా నావైపు వచ్చింది. ఉయ్యాల ఊగుతున్నట్లుగా నావైపు వస్తోంది అది. దగ్గరకు వస్తుండగా నన్ను చూసి భయపడిందో, మరేమనుకుందో కాని, ఆ ఆకారం మాయమయింది. అది ఏమైందా... అని చూస్తున్నంతలో ఒక నల్లని మనిషిలా ఉన్న ఆకారం నా దగ్గరకు రాసాగింది. వచ్చి వచ్చి నాముందు నిలబడింది.''

మాస్టారు చెప్పడం ఆపాడు.

''అప్పుడేమైంది మాస్టారూ?''

''ఆ దయ్యం మిమ్మల్నేమీ చేయలేదూ?''

''మీకు భయం వేయలేదూ?''

''మీతో ఏమన్నా మాట్లాడిందా?''

నలుగురూ నాలుగు ప్రశ్నలు వేశారు.

వారి ఆదుర్దా గమనించి గిగీశం మాస్టారు వాళ్ళవంక చిరునవ్వుతో చూశారు.

“ఆ.... మాట్లాడింది. ‘బాబూ... చుట్ట ఆరిపోయింది- కొంచెం అగ్గిపెట్టె ఉంటే ఇస్తావా...’ అని అంది” అన్నారు మాస్టారు.

“ఓస్... చీకట్లో కాలుతున్న చుట్టని చూశా- కొరివిదయ్యం అన్నారు?!” అంటూ అందరూ పగలబడి నవ్వుకున్నారు.

“మనం కొరివిదయ్యాలు, దయ్యాలు అనుకునే వాటిల్లో చాలావరకూ ఇటువంటివే!” అంటూ లేచారు మాస్టారు.

*- భారత మిత్రం... 17 ఫిబ్రవరి ’80*



**ఆశాజీవి**

రెండవ ప్రపంచయుద్ధంలో పాల్గొన్న సైనికులు బాగా అలసిపోయారు, విసిగిపోయారు. వారు ప్రయాణిస్తున్న సైనిక నావ అట్లాంటిక్ మహాసముద్రాన్ని దాటుతోంది. వాతావరణం సరిపడక ఒక నావికుడు అకస్మాత్తుగా జబ్బు పడ్డాడు. అతనికి ధైర్యం చెప్పే ఉద్దేశంతో మిత్రుడొకడు-

“దిగులు పడకు. ఇంతవరకూ ఏ నావికుడూ సీ-సిక్‌నెస్‌తో చనిపోలేదు” అని అన్నాడు.

మొదటి నావికుడు- “చచ్చిపోతానన్న ఆశే నన్నింతకాలం బ్రతికించింది. అందువల్ల అలా అనకు” అంటూ అటుతిరిగి పడుకున్నాడు.